ప్రజాశక్తి

గురువారం 12 జూన్ 2025 పేజీలు 8

విజయనగరం పార్వతీపురం మన్యం

గజపతినగరంలో కానరాని అభివృద్ధి



- నెరవేరని నగర పంచాయతీ మాట
- భీమసింగి సుగర్స్ మూతతో రైతు కంట కన్నీరు
- ఎంఎన్ ఛానల్ హామీ నీటి మూటేనా?
- సొంత భవనానికి నోచని డిగ్రీ కళాశాల
- మంత్రి కొండపల్లి ఇలాకాలో దుస్థితి

జిల్లాకు చెందిన అమాత్యునివారి ఇలాకాలో అభివృద్ధి కానరావడం లేదు. గజపతినగరం నగర పంచాయతీ అన్నమాట వట్టి మూటగానే మిగిలిపోయింది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచుతామన్న మాటలు కోటలు దాటినా ఆచరణ గడప దాటలేదు. పైగా నియోజకవర్గంలో ఉన్న ఒక్కగానొక్క భీమసింగి చక్కెర ఫ్యాక్టరీ అమాత్యులవారి హయాంలోనే విజయవంతంగా మూతపడిపోయింది. ఎంఎన్ ఛానల్ ఆధునీకరణ, ఆంధ్ర కెనాల్‌కు లింకు చేయడం వంటి హామీ నీటి మూటగానే మిగిలిపోయింది. గజపతినగరం బ్రాంచి కెనాల్ (తోటపల్లి కాలువ) ఒక్క అడుగూ ముందుకు పడలేదు. డిగ్రీ కాలేజీ, నరవలో జ్యోతిరావుపూలే పాఠశాలలకు సొంత భవనాలు కూడా నిర్మించని దుస్థితి. సుజల స్రవంతి కాలువ అలైన్‌మెంట్ హామీ కూడా అంతే సంగతి అన్నట్టుగా మిగిలిపోయింది. మంత్రి ఇలాకాలోనే ఇలాంటి దుస్థితి ఉంటే, జిల్లా మరెంత ధీనంగా ఉందో? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావచ్చింది. ఆ వెంటనే గజపతినగరం నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే శ్రీనివాస్ అనూహ్యంగా మంత్రి కూడా అయ్యారు. దీంతో ప్రజల ఆశలు, ఆకాంక్షలు రెట్టింపయ్యాయి. మంత్రి హామీల అమలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం (మిగతా..3లో)

మోగనున్న బడిగంట

- నేడు పాఠశాలలు పున: ప్రారంభం
- పూర్తి కాని అదనపు భవనాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్ /పార్వతీపురం

నేటి నుంచి బడి గంట మోగనుంది. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. 50 రోజుల పాటు పుస్తకాలు మూలన పడేసిన విద్యార్థులు.... గురువారం నుంచి స్కూల్ బ్యాగ్ నిండా పుస్తకాలు, చేతిలో క్యారేజీతో సైకిల్‌పై, ఆటోల్లో, బస్సుల్లో బడికి వెళ్లేందుకు సిద్ధమవు తున్నారు. విజయనగరం జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 1717 పాఠ శాలలు ఉన్నాయి. ప్రయివేటు విద్యాసంస్థలలో ప్రాథమిక పాఠశాలలు 127, ప్రాథమికోన్నత పాఠశాలలు 149, హైస్కూళ్లు 155 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1.40 లక్షల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల్లో సుమారుగా లక్షకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం 1717 ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతోంది. మొత్తం 1.25 లక్షల మంది విద్యార్థులకు అమలు జరుగుతోంది.

అప్‌గ్రేడ్‌పై సందిగ్ధత

జిల్లాలో ఏడు హైస్కూళ్లలో జూనియర్ కళాశాల తరగతులు (మిగతా..3లో)



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - విజయనగరం

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, పింఛను సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో డిఆర్ఒ ఇ. మురళీతో సహా అన్ని మండలాల తహశీల్దార్లకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. విజయనగరంలో ఫెడరేషన్ సీనియర్ నాయకులు బూరాడ శ్రీనివాసరావు, ఎన్.మధుసూదనరావు నాయకత్వంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సింహాదాడి మురళీశంకరరావు, జిల్లా నాయకులు రమేష్‌నాయుడు, బాబూరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్ని చోట్ల ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు పింఛను సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే అక్రిడిటేషన్లు మంజూరు చేయడంతోపాటు ఆ కమిటీలో ఫెడరేషన్, ఎపిబిజెఎల ప్రాతినిధ్యాన్ని కొనసాగించాలని కోరారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు జర్నలిస్టులు, అధికారులతో నివారణ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేశారు. మీడియా అకాడమీని బలోపేతం చేయాలని, జర్నలిజాన్ని ప్రోత్సహించే దిశగా అవార్డులు ప్రదానం చేయాలని చెప్పారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించే దిశగా చట్టాలను అమలు చేయాలని, కార్మిక బీమా, ఆరోగ్య బీమా పథకాలు అమలు చేయాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా అధికారులకు వినతులు

డిఆర్ఒ మురళికి వినతినిస్తున్న జర్నలిస్టు సంఘం నాయకులు

సమస్యలు పరిష్కరించండి: ఎంపిపి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపిపి ఎస్.లక్ష్మీ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మొదట అగ్రికల్చర్ శాఖ పై సమీక్షలో ఎడిఎ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతు కార్డులు నమోదు కార్యక్రమం చేపడుతున్నామని కౌలు రైతులు వినియోగించుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ రూ. 20 వేలు సాయం ప్రభుత్వం అందించనుందన్నారు. దీనికి గాను వెబ్ ల్యాండ్‌లో నమోదు, ఖాతా నెంబర్, ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి శాఖల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రవికుమార్, వైస్ ఎంపిపి శంకర్రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేగిడి తహశీల్దార్‌గా కృష్ణలత

ప్రజాశక్తి- రేగిడి

మండల తహశీల్దార్‌గా ఐ.కృష్ణలత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె జామి తహశీల్దారుగా పనిచేస్తు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇంఛార్జి తహశీల్దారుగా పనిచేసిన ఈశ్వరరావు మాతృ శాఖ అయిన సర్వే డిటిగా వెళ్లారు. ముందుగా తహశీల్దార్‌ను కార్యాలయ సీనియర్ సహాయకులు ఆర్‌ఐ రేవతి, మురళి, ఏఎస్ఒ యేసుబాబు జూనియర్ సహాయకులు గిరి, గోవింద్‌తో పాటు విఆర్వోలు దొర, ఈశ్వరరావు, హరీష్, భవాని తదితరులు పుష్ప గుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యలు తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం చేస్తామన్నారు. అందరి సహకారంతో రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

మెంటాడ తహశీల్దార్‌గా అరుణకుమారి

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ తహశీల్దార్‌గా మరడాన అరుణకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కోరాడ శ్రీనివాసరావు బదిలీపై లక్కవరపుకోట మండలానికి వెళ్లడంతో ఆయన స్థానంలో ఎస్‌కోట మండలం నుంచి వచ్చిన అరుణకుమారి బాధ్యతలు చేపట్టారు. ఆమెకు మండల నేతలు, ఇతర అధికారులు అభినందనలు తెలిపారు.

డిటి, ఎఎస్ఒ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉప తహశీల్దార్‌గా పనిచేసిన డి.సన్యాసినాయుడు బదిలీపై గుమ్మలక్ష్మీపురం వెళ్లడంతో ఆ స్థానంలో కొత్తవలస రెవెన్యూ కార్యాలయంలో సిఎస్‌డిటిగా పనిచేసిన పి.రామకృష్ణ బుధవారం ఇక్కడ డిటిగా బాధ్యతలు చేపట్టారు. ఎఎస్ఒగా భోగాపురంలో పనిచేసిన ఎం.గణేష్ ఇక్కడకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

డెంకాడ ఎఒగా సంగీత

ప్రజాశక్తి- డెంకాడ

మండల వ్యవసాయ శాఖ అధికారిగా టి. సంగీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విజయనగరం జిల్లా వనరుల కేంద్రంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన మండల వ్యవసాయ అధికారి పి.నిర్మల భోగాపురం బదిలీపై వెళ్లారు.

మహిళలకు రక్షణ పట్ల అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహిళా పోలీసులు మహిళల రక్షణ పట్ల అవగాహన కల్పించాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించి మహిళా పోలీసులు తమ పరిధి గ్రామాల్లో మహిళలకు గల ప్రత్యేక చట్టాలు, రక్షణ, వారి హక్కులు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించాలని మహిళా పోలీసులకు సూచించారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మత్తుల కారణంగా రేపు మండలంలోని గజపతినగరం, పురిటిపెంట, హౌసింగ్ కాలనీ, ఒలం కంపెనీతో పాటు అన్ని గ్రామాలలో, మెంటాడ మండలం మధ్రివలస పంచాయతీకి విద్యుత్ అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని ఎఇఇ శివకుమార్ తెలిపారు.

నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలి: సిఐటియు

ప్రజాశక్తి- రాజాం

జీతాల పెంపు, సంక్షేమ పథకాల కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులంతా నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు నైపుణ్యానికి తగిన విధంగా జిఒ 36 ప్రకారం రూ. 21వేలు, రూ.24500లు జీతాలు చెల్లించాలన్నారు. షరతుల్లేకుండా మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలైన 75 వేల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్, 5 లక్షల నుండి ఏడు లక్షల రూపాయలకు ఎక్స్ గ్రేషియో పెంపు, దహన సంస్కారాలకు రూ.15వేలు నుండి 20వేలకు పెంపు, వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు, ఆప్కాస్ ద్వారా రిటైర్ అయిన, చనిపోయిన, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేస్తే పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటి చెల్లించాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం 2025 జూన్ 20వ తేదీ తరువాత ఏరోజు నుండైనా జరిగే రాష్ట్రవ్యాపిత సమ్మెలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంచినీటి సరఫరా, వీధిలైట్లు, టౌన్ ప్లానింగ్, కంప్యూటర్ ఆపరేటర్స్, లీక్ వర్కర్లు, డ్రైవర్లు, మెకానిక్, ఫంక్షరింగ్, వెటర్నరీ తదితర విధులు రిస్క్‌తో కూడినవని గుర్తుచేశారు. ఈ మేరకు తరచూ ప్రమాదాల బారిన పడటం అనేకమంది కాళ్లు, చేతులు మరి కొంతమంది ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఉన్నారని, వారి కుటుంబాలు వీధి పాలవుతున్నా పట్టించుకునే నాథుడు లేడని అన్నారు. గత పదేళ్లుగా ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని పోరాడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో 17 రోజుల సమ్మె కాలంలో ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచడానికి ససేమిరా అందని, రాష్ట్ర సదస్సులు, 2025 జనవరి 3వ తేది మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించామని, మార్చి 7వ తేది ఛలో విజయవాడ నిర్వహించామని అయినా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన తప్ప సమస్యలు పరిష్కరించడంలేదని అన్నారు. ఇప్పటికైనా అందరం కలిసికట్టుగా ఉండి చావో.. రేవో తేల్చుకుందాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ నాయకులు హరిబాబు, కృష్ణ, అనిల్, శారద, కనకరాజు, పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు, నాయకులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు బుధవారం తెలిపారు. జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు స్థానిక సిఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు వైపులా జాతీయ రహదారి విస్తరించి ఉండడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు ప్రమాదాలు జరిగే చోట అవగాహనతో కూడిన హోర్డింగులు ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించినచోట రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఐదు పెద్ద సైజు హోర్డింగులను పినతాడివాడ జంక్షన్, చింతలవలస 5వ బెటాలియన్ మెయిన్ గేట్ ఎదురుగాను, జొన్నాడ గ్రామ సమీపంలోను, మోదవలస ప్రెస్ వద్ద ఏర్పాటు చేశామన్నారు. అయినాడ జంక్షన్, చింతలవలస బెటాలియన్ మెయిన్ గేట్ జొన్నాడ టీ పాయింట్ జన్నాడ పైడితల్లి అమ్మవారి టెంపుల్ మోదవలస ప్రెస్ ఛాయిస్ రోడ్లలో సేఫ్టీలో భాగంగా రేడియం స్టిక్కర్లను అంటించామన్నారు.

రాష్ట్రంలో నీచ రాజకీయాలు : శంబంగి

ప్రజాశక్తి - బొబ్బిలి

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నీచ రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజల మద్దతుతో మున్సిపాలిటీలో వైసిపి విజయం సాధిస్తే కొంతమంది కౌన్సిలర్లను ప్రలోభ పెట్టి అవిశ్వాస తీర్మానం పెట్టి దొడ్డిదారిలో పదవులు పొందుతున్నారని విమర్శించారు. కూటమి అరాచకాలకు ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు మాట్లాడుతూ వైసిపి హయాంలో అన్ని సామాజిక తరగతులకూ న్యాయం చేశారన్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా పదవులపై దృష్టి పెడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అవిశ్వాస తీర్మానంతో వెనుకబడిన తరగతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. తమ పాలనలో బాధ్యతాయుతంగా అవినీతి రహిత పాలన అందించామని చెప్పారు. చైర్మన్ ఛాంబర్ ఆధునీకరణ చేసేందుకు రూ.5లక్షలు కేటాయించడం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడమేనన్నారు. రోడ్లపై గోతులను పూడ్చేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రమాదేవి మాట్లాడుతూ యాదవులను తెలెత్తుకునేల తనకు వైస్ చైర్మన్ పదవి వైసిపి అధిష్టానం ఇచ్చిందన్నారు. యాదవులంతా కూటమికి బుద్ధి చెప్పాలని కోరారు. టిడిపిలో చేరితే వైస్ చైర్మన్ పదవిలో కొనసాగిస్తామని చెప్పినప్పటికీ పార్టీకి అన్యాయం చేయకూడదని మారలేదన్నారు. చైర్మన్ పదవి కాపులకు ఇచ్చినట్లు వైస్ చైర్మన్ పదవి కూడా యాదవులకు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు ఎస్.రామకృష్ణ, ఇంటి గోవిందరావు, కె.రాములు, పి.ఉమాశంకర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే తీరుపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తాం'

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా గెలిచిన కోళ్ల లలిత కుమారి నియోజకవర్గంలోని బిజెపి నాయకులను పట్టించుకోవటం లేదని బిజెపి నియోజకవర్గ కో కన్వీనర్ చొక్కాకుల అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి బిజెపి సమావేశంలో సీనియర్ నాయకులు ఐదు మండలాల అధ్యక్షులు పాల్గొని కూటమి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఆమె గెలిచి సంవత్సరం కాలం అవుతున్నప్పటికీ నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని కొత్తవలస ప్రభుత్వ ఆసుపత్రి పందుల దొడ్డును తలపిస్తుందని, చిన్న వర్షానికి కొత్తవలస జంక్షన్లో నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సమస్య పరిష్కారం చేయలేదని గుర్తు చేశారు. బీసీ లోన్లు, నీటి సంఘాల ప్రెసిడెంట్ ఎన్నికలలోనూ, మార్కెటింగ్ కమిటీ సభ్యుల నియామకంలోనూ పార్టీ సీనియర్ నాయకులకు గాని మండల అధ్యక్షునిగాని ఎటువంటి సమాచారమూ ఇవ్వలేదని, పొత్తు ప్రకారం బిజెపి పార్టీకి ఐదు శాతం కేటాయించవలసి ఉన్నప్పటికీ ఆమె ఏనాడు ధర్మాన్ని పాటించలేదని ఈ విషయం ఇప్పటికే జిల్లా నాయకుల దృష్టికి తీసుకువెళ్ళామని ఎమ్మెల్యే తీరు మార్చుకోకుంటే రాష్ట్ర, జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మాన్యం దేముడు, దొడ్డి సూర్యారావు, దాశరథి, జిల్లా ఎగ్జిక్యూటివ్ రాముడు, రామకోటి, చంద్రశేఖర్ ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు

రేషన్ అందక ప్రజలకు అగచాట్లు

బొబ్బిలి: రేషన్ సరఫరాను డీలర్లకు అప్పజెప్పిన దగ్గర నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు, జై భీమ్‌రావ్ భారత పార్టీ రాష్ట్ర డిప్యూటీ లీడర్ పి.జ్యోతి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాల్ అన్నారు. బుధవారం పట్టణంలో వారు మాట్లాడుతూ 15 రోజులు కంటిన్యూగా రేషన్ ప్రజలకి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నప్పటికీ డీలర్లు ఆ విధంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ముసలి వాళ్లకు ఇంటిదగ్గర తీసుకువెళ్లి రేషన్ ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ డీలర్లు ఎవరూ ఇవ్వడం లేదని అన్నారు. డీలర్ల వద్దకు ప్రజలు రేషన్ కోసం వెళ్తే తమ దగ్గర అయిపోయింది వేరే దగ్గరికి వెళ్లండని డీలర్లు సమాధానం ఇస్తున్నారన్నారు. రేషన్ సరుకులు పక్కతోవ పట్టించి అక్రమాలకు పాల్పడే అవకాశం కనిపిస్తుందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రతి నెల 15 రోజులు పాటు రేషన్ షాపులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లాకు తీవ్ర అన్యాయం

- ఏడాదిలో కూటమి చేసిన అభివృద్ధి శూన్యం
- సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. జిల్లాకు ఇచ్చిన హామీల అమలుకు ప్రయత్నించలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి తగిన సాయం అందించలేదన్నారు. చేసిన అభివృద్ధి శూన్యమని, జిల్లాకు తీవ్ర అన్యాయం కొనసాగుతూనే ఉందని విమర్శించారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి వట్టి మాటగానే నిలిచిపోయిందని ఎద్దేవాచేశారు. ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ఏడాదిలో ప్రజలను వంచనకు గురిచేశారని దుయ్యబట్టారు. జిల్లాలో కొద్దిపాటి పరిశ్రమలు మూతపడ్డాయని, కొత్త పరిశ్రమలు రాలేదని చెప్పారు. దేశాభివృద్ధికి, మానవ వనరుల వృద్ధికి దోహదపడే గిరిజన విశ్వవిద్యాలయం కన్నా కార్పొరేట్లకు ఉపయోగపడే భోగాపురం ఎయిర్‌పోర్టుకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, చిన్నచూపు జిల్లాలో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు.

అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగాన్ని ఉద్ధరిస్తామని చెప్పారు కానీ, ఆ రంగం అభివృద్ధికి అత్యంత కీలకమైన సాగునీటి వనరులకు తగినంతగా నిధులు కేటాయించలేదన్నారు. బొబ్బిలి, గజపతినగరం బ్రాంచి కెనాల్ పూర్తిచేస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఉపాధి హామీ అమల్లో కూడా జిల్లా వెనుకబడిందని తెలిపారు. తగినన్ని పనిదినాలు కల్పించడం లేదని, రూ.వందల కోట్ల బకాయి ఉందని గుర్తుచేశారు. సహకార రంగంలో ఉన్న భీమసింగి చక్కెర ఫ్యాక్టరీని మూసేశారని, సంకిలి ఫ్యాక్టరీ కూడా ఇదే దశలో ఉందని తెలిపారు. చెరకు రైతుల్ని మోసం చేశారన్నారు. కొత్తవలసలో జిందాల్ పరిశ్రమ మూతపడి వందలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయినా ప్రభుత్వం గానీ, జిల్లాకు చెందిన మంత్రి గానీ చలించలేదని మండిపడ్డారు. జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కూడా ఎప్పటికప్పుడు మూతపడుతున్నాయని చెప్పారు. మరోవైపు ఎంఎస్ఎంఇ పార్కుల పేరిట జిల్లాలో వందలాది ఎకరాలు సేకరించారన్నారు. ఇప్పటికైనా పరిశ్రమల మూత, కొత్త పరిశ్రమలు రాకపోవడం వంటి వాటిపై జిల్లా మంత్రి శ్రీనివాస్ సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. రేషనలైజేషన్ పేరిట జిల్లాలో 236 యుపి స్కూళ్లను మూసివేసేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. పాఠశాలల్లో సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలో జ్వరాలు, సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని, వీటిపై దృష్టిసారించాల్సిన ప్రభుత్వం యోగాసనాల నేర్పించడమంటే వైద్యారోగ్య బాధ్యతల నుంచి తప్పించుకోవడమేనని ధ్వజమెత్తారు. ఇప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీమోతలు తప్పడం లేదన్నారు. నిరుద్యోగ యువతను మోసం చేశారని, డిఎస్‌సి తప్ప ఇతర ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇస్తామన్న మాట నిలబెట్టుకోలేదని చెప్పారు. బిసి రుణాలు మొక్కుబడిగా ఇచ్చారని, రాజకీయాల సిఫార్సులకు పెద్దపీట వేశారన్నారని తెలిపారు. వేపాడ మండలంలోని మారిక కొండను అదానీ కంపెనీకి దోచిపెట్టడానికి ప్రభుత్వ పెద్దలు కుట్ర చేస్తే జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదని దుయ్యబట్టారు. భోగాపురం మండలంలో హోటళ్ల నిర్మాణం పేరిట కార్పొరేట్లకు కారుచౌకగా ప్రభుత్వ భూములు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. విజన్ -47, పి-4 పేరిట ఆరు నెలలుగా ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని, ప్రజా సమస్యలను, అభివృద్ధి, సంక్షేమ పథకాలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ఇప్పటికైనా పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల పంపిణీ, సీజనల్ వ్యాధులు దృష్టిపెట్టాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ, వి.లక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

బివిపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని భరతవానిపాలెంలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో రాములునాయుడు షాపులో సామగ్రి దగ్ధమైంది. నష్టం వివరాలు తెలియరావల్సి ఉంది.

శాస్త్రీయ విజ్ఞానం అవసరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానం పెరిగితే సామాజిక అభివృద్ధి సాధ్యపడుతుందని ఉడా కాలనీ ఈవినింగ్ క్లబ్ అధ్యక్షులు జామి అప్పలసూరి, వ్యవస్థాపకులు కొత్తలి ఎర్రాయుడు అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి షిణగం శివాజీని మంగళవారం ఉడా కాలనీ ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లగా శివాజీ ప్రజలను మూఢనమ్మకాల నుంచి చైతన్య పరుస్తూ, ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు గౌరీప్రసాద్ పట్నాయక్, కోశాధికారి ఆదినారాయణ, పూర్వ అధ్యక్షులు త్యాడ చిరంజీవిరావు, పూర్వ కోశాధికారి మోహన్ దత్త, రామారావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో లోపాలుంటే చర్యలు

ప్రజాశక్తి - వేపాడ

విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది లోపాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ సి హెచ్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో పాటు సిబ్బంది కూడా ప్రభుత్వ నిబంధన మేరకు సకాలంలో కార్యాలయానికి రాకపోయినా, సచివాలయం సందర్శనకు వచ్చినప్పుడు సిబ్బంది లేకపోయినా, రికార్డులు పూర్తి చేయకపోయినా, చేసిన పనులు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయకపోయినా సహించేది లేదన్నారు. విధులు సక్రమంగా నిర్వహించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జెఎన్‌టియులో వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జెఎన్‌టియు-జివిలో స్మార్ట్ స్కిల్స్ ఫర్ ఎ సెక్యూర్ ఫ్యూచర్ అనే అంశంపై నాన్-టీచింగ్ స్టాఫ్‌కు బుధవారం వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పనిచేసే చోట, నిజ జీవితంలో స్మార్ట్ స్కిల్స్ అవసరం ఎంతైనా ఉందన్నారు. నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదన్నారు. రిజిస్ట్రార్ జి.జయసుమ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి కూడా సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జెఎన్‌టియు-జివి ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ఆర్.రాజేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

బొబ్బిలి : ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ఎబిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. నాగభూషణం డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచి దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఫీజులు వసూళ్లపై పర్యవేక్షణ చేసి అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గజపతినగరంలో కానరాని అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికీ వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఏడాది పాలన సందర్భంగా రాష్ట్ర రాజధాని అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఐఎఎస్ అధికారులతో గురువారం ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి జిల్లాలోని మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు తరలివెళ్లారు. ఈనేపథ్యంలో మన జిల్లాలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజకవర్గంలో సమస్యలు, ఎన్నికల హామీలు, అమలు, ముందుకొచ్చిన సమస్యలు, వాటిపై స్పందించిన తీరుపై సర్వత్రా చర్చ నడుస్తోంది. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న గజపతినగరాన్ని నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రయత్నిస్తామని మంత్రి ఎన్నికల హామీ ఇచ్చారు. ఈ ఏడాదిలో దానిపై చర్చేలేదు. కనీసం ప్రభుత్వ దృష్టిలో పెట్టినట్టు కూడా ఎక్కడా ప్రకటించలేదు. నియోజకవర్గంలో చదువుకున్న నిరుద్యోగులు కుప్పలు తెప్పలుగా ఉన్నారని, తన తెలివితేటలను ప్రభుత్వ దృష్టిలో పెట్టడం ద్వారా ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీలు గుప్పించారు. ఆచరణలో ఇప్పటి వరకు అటువంటిదేమీ కనిపించలేదు. పైగా సొంత నియోజవర్గంలోని రామన్నపేట అంగన్‌వాడీ ఆయా తొలగింపులో రాజకీయ ఒత్తిడి చేశారన్న విమర్శలు చవిచూశారు. మరోవైపు చెరకు రైతులకు బువ్వపెట్టే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మూతపై కనీసం నోరు మెదపని దుస్థితి కనిపించింది. దీంతో, ఆయా రైతు కుటుంబాలు ఒకింత ఆందోళనలో ఉన్నాయి. జీవనోపాధి తీసేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్నికల్లో మరో ముఖ్యమైన హామీ ఎంఎన్ ఛానల్ ఆధునీకరణ, ఆంధ్ర జలాశయ కాలువకు లింకు చేయడం. ఇది కూడా నెరవేరకపోవడంతో రైతులు నివ్వెరబోతున్నారు. వాస్తవానికి ఎంఎన్ ఛానల్ ఆధునీకరణ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక భారం కాదు. దీనివల్ల శివారు ఆయకట్టుకు నీరందడానికి వీలు కలుగుతుంది. కొన్నిచోట్ల రెండో పంటకు అవకాశం ఏర్పడుతుంది. అయినా సరే దీనిపై దృష్టిపెట్టలేదు. గజపతినగరం బ్రాంచి కెనాల్ (తోటపల్లి కాలువ) ఏడాదిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రూ.211 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. దీన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో మంత్రి చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యా రంగంపైనా అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా గజపతినగరంలో డిగ్రీ కాలేజీని గత ప్రభుత్వం మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీనికి శాశ్వత ప్రాతిపదికన భవనం నిర్మాణం చేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. గంట్యాడ మండలం నరవలోని జ్యోతిరావు పూలే పాఠశాలకు కూడా భవనం నిర్మిస్తామన్నారు. వీటి గురించి ఇప్పటికీ క్లారిటీ ఇవ్వలేదని ఆయా యాజమాన్యాలే ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో, తీవ్ర అవస్థలు పడాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఎంఎస్ఎంఇ పార్కు పేరిట బొండపల్లి మండలం రాచకిండాంలో భూమి సేకరించినప్పటికీ అక్కడ ఎలాంటి పరిశ్రమలను ప్రోత్సహిస్తారో? సామాన్యులకు ఎంతమేర అవకాశం దక్కుతుందో తెలియని పరిస్థితి. అక్కడక్కడ సిసి రోడ్లు, గుంతలు పూడ్చివేత మాత్రం చేపట్టారు. అవికూడా తవ్వేసిన కొన్ని నెలల తరువాత చేపట్టడం జనం తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న మంత్రి ఇలాకాలోనే ఇటువంటి దుస్థితి ఉంటే జిల్లాలో అమలు కాని, హామీలు, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఇంకెన్ని ఉన్నాయో అంటూ జనం చర్చించుకుంటున్నారు.

ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమం

ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ముందుకు తీసుకువెళ్లగలిగాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నాం. సామాజిక పింఛన్ల పెంపుతోపాటు వితంతు పింఛన్లను మంజూరుచేశాం. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల అమలుకు ప్రయత్నాలు విస్తృతమయ్యాయి. తల్లికి వందనం పథకం కొద్ది రోజుల్లో అమలు కానుంది. ఖరీఫ్ ప్రారంభమయ్యే నాటికి అన్నదాత సుఖీభవ పథకం సాయం రైతులకు అందనుంది. ఆగస్టు 15వ తేది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందని ఇప్పటికే సిఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయనున్నాం. కొత్త పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మోగనున్న బడిగంట

(మొదటి పేజీ తరువాయి)

మంజూరు చేస్తూ ఏడాది క్రితం అప్‌గ్రేడ్ చేశారు. ధర్మవరం హైస్కూల్లో గత ఏడాది నుంచి జూనియర్ ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. దీంతోపాటు 2024లో జామి, కోనూరు, రామభద్రపురం, ఎ.వెంకటాపురం, బొండపల్లి, పిరిడిలో ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులకు ఈ ఏడాది నుంచి అనుమతిస్తూ అప్‌గ్రేడేషన్ చేశారు. రెండు గ్రూపుల నిర్వహణకు అనుమతిచ్చారు. ఎంపిసి, సిఇసి గ్రూపులో విద్యార్థులను చేర్చుకున్నారు. అంత వరకు బాగానే ఉన్న ఇంతవరకు అప్ గ్రేడ్ అయిన కళాశాలలకు అధ్యాపకులను నియమించలేదు. హై స్కూల్ ఉపాధ్యాయులతోనే పాఠ్యాంశాలు బోధించి మమా అనిపించారు. ఉపాధ్యాయులు లేక, సరైన బోధన జరగక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అప్‌గ్రేడ్ అయిన కళాశాలలు ఈ ఏడాది ఉంటాయి? లేదా? అనేది ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. ఆ కళాశాలల్లో చేరిన విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా మారింది.

9 రకాలుగా పాఠశాలల విభజన

ఈ ఏడాది నుంచి పాఠశాలలను ప్రభుత్వం 9 రకాలుగా విభజించింది. వాటిలో 1.శాటిలైట్ పాఠశాలలు, 2.ఫౌండేషన్ పాఠశాలలు (147), 3.బేసిక్ ప్రైమరీ పాఠశాలలు (946), 4.మోడల్ ప్రైమరీ స్కూల్స్ (239), 5.ప్రాథమికోన్నత పాఠశాలలు (128), 6.ఉన్నత పాఠశాలలు 6 నుంచి పదో తరగతి (128), 7.ఉన్నత పాఠశాలలు 1 నుంచి పదో తరగతి (186), 8.ఉన్నత పాఠశాలలు 1 నుంచి 12 (51), 9.ఉన్నత పాఠశాలలు 6 నుంచి 12 (20).. ఇలా 9 రకాలుగా విభజించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు.

పూర్తికాని నాడు-నేడు పనులు

రెండో దశ నాడు-నేడు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడుతో చేపట్టిన అదనపు భవనాలు, తరగతి గదులు నిర్మాణాలు నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయలేదు. దీంతో ఈ ఏడాది కూడా విద్యార్థులు ఇరుకు గదుల్లో, రెండేసి సెక్షన్లు కలిపి కూర్చోవాల్సి ఉంది. 737 పాఠశాలల్లో చేపడుతున్న పనులకు ఇంకా రూ.100 కోట్ల వరకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. అవి విడుదల అయితే తప్ప పనులు జరిగే పరిస్థితి లేదు.

సమస్యలతో స్వాగతం

విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదు. నూతన విద్యా సంవత్సరంలో వస్తున్న విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికే విధంగా చర్యలు లేవు. చాలా పాఠశాలల్లో భవనాలు కొరత ఉంది. సుమారుగా 200 పాఠశాలలకు ప్రహరీ గోడలు లేవు. వంద పాఠశాలల వరకు మరుగుదొడ్లు లేవు. సుమారు 800 పాఠశాలల్లో తరగతి గదుల సమస్య వెంటాడుతోంది. ఇవేవీ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పరిష్కారం చెయ్యలేదు. దీంతో సమస్యల నడుమ ఈ ఏడాది కూడా పాఠశాలలు నడవనున్నాయి.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : మంత్రి

ప్రజాశక్తి-బొండపల్లి, దత్తిరాజేరు

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బొండపల్లి మండలం దేవుపల్లి, దత్తిరాజేరు మండలంలోని కెజిబివిల్లో ఒక్కో చోట రూ.2.12 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో కల్పించనున్న అదనపు వసతులకు బుధవారం మంత్రి కొండపల్లి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా పాఠశాలలను పరిశీలించారు. అక్కడి ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో చాలా వరకు ఈ ఏడాదిలోనే అమలు చేశామని చెప్పారు. గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని, మౌలిక వసతుల కల్పనను కూడా పట్టించుకోలేదని అన్నారు. గ్రామ పంచాయతీల నిధులను సైతం పక్కదారి పట్టించిందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలకు నిధులను కేటాయించామని అన్నారు. గజపతినగరం నియోజకవర్గంలోనే ఈ ఏడాదిలో సుమారు రూ.100 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. వీటిలో ఇప్పటికే రూ.50 కోట్లు విలువైన పనులు ప్రగతిలో ఉన్నాయని చెప్పారు. నీటి పారుదల రంగానికి, కాలువల మరమ్మతులకు నిధులను కేటాయించడంతో రైతులు సంతోషంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు, గజపతినగరం ఎఎంసి ఛైర్మన్ పివివి గోపాలరాజు, బొండపల్లి ఎంపిపి చల్లంనాయుడు, వైస్ ఎంపిపి బొడ్డు రాము, తహశీల్దార్లు డి.రాజేశ్వర్రావు, విజయకుమార్, ఎంపిడిఒలు గిరిబాల, రాజేంద్రప్రసాద్, దేవుపల్లి సర్పంచ్ చంద్రకళ, కెజిబివి ప్రిన్సిపల్స్ చంద్రకళ, పాల్గొన్నారు.

విజయనగరం:శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం టౌన్ : నగరంలో వివిధ ప్రాంతాల్లో రూ.10.79 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శ్రీకారం చుట్టారు. కెఎల్‌పురంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం బుచ్చెన్న కోనేరు వద్దనున్న ఇపిడిసిఎల్ కేంద్రం వద్ద అదనపు 5 మెగా వోల్టేజ్ యాంప్స్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, ఎఎంసి ఛైర్మన్ కర్రోతు నర్సింగరావు, కార్పొరేటర్లు తాళ్లపూడి సంతోషి కుమారి, కర్రోతు రాధామణి, కార్పొరేషన్ ఇఇ టి.రాయల్ బాబు, ట్రాన్స్‌కో ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఇఇ పి.త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ : విజయనగరం మండలంలోని సారిక, చెల్లూరు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అదితి గజపతి రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొద్దుల నరసింగరావు, ప్రధాన కార్యదర్శి గంటా పోలినాయుడు, జనసేన పార్టీ నాయకులు బొబ్బాది చంద్ర నాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : మండలంలోని రూ.10.80 కోట్లతో గ్రామీణ రోడ్లు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే బేబినాయన స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్ డి.ఇ అప్పారావు, ఎంపిడిఒ రవికుమార్, టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాడ భాస్కరరావు, మండల టిడిపి అధ్యక్షులు వి.సత్యన్నారాయణ, ఎపిఒ లక్ష్మీపతిరాజు, ఎఇ రాజ్ శేఖర్ పాల్గొన్నారు.

కొత్తవలస: వియ్యంపేట పంచాయతీ పరిధిలో గల కొట్టానవానిపాలెం, రామలింగాపురం, వీరభద్రపురం పంచాయతీ ములగపాకవానిపాలెం గ్రామాలలో రూ.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో ఆమోదించిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, ఉపాధ్యక్షులు ఎల్లపు సూరిబాబు, చింతలపాలెం సర్పంచ్ మాకేన సీతారాంపాత్రుడు, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల శ్రీను, విశాఖపట్నం కార్యనిర్వాహక కార్యదర్శి కోరుపోలు అప్పారావు, పొట్నూరు వెంకటరత్నాజి, పులిబంటి రాము, పాల్గొన్నారు.

గుర్ల: స్థానిక ఎన్‌టిఆర్ కాలనిలో రూ.15 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ప్రారంభించారు. కస్తూరిబా గురుకుల పాఠశాలలో రూ.2.21 కోట్లతో అదనపు గదుల నిర్మాణానికి, జెడ్‌పి ఉన్నత పాఠశాలలో రూ.4.95లక్షలతో కళావేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వల్లాపురం, శేషాపు పేట గ్రామాలలో రైతు సేవా కేంద్రం, పల్లెపండగ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, జిల్లా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుములరాజు కిరణ్ కుమార్, జనసేన నాయకులు విజినిగిరి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్ష, ఉపధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు, కిలారి సూర్య నారాయణ, ప్రసాద్, వ్యవసాయ శాఖ జెడి రామారావు, తహశీల్దార్ పి.అది లక్ష్మీ, ఎంపిడిఒ శేషుబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బుధవారం మండల కేంద్రంలో గల పెదఖండేపల్లి రోడ్డులోని సాయి బాబా గుడి వద్ద నూతనంగా రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని ధర్మవరం గ్రామంలోని మారుతీ నగర్ వద్ద ఆర్అండ్ బి రోడ్డు నుంచి కృష్ణాపురం వరకు నూతనంగా రూ.19 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు జివస్ నాయుడు, ప్రధాన కార్యదర్శి రామసత్యం, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రామనాజీ, ఐటిడిపి నాయకులు చక్కా కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, వాకాడ బాలు, భీశెట్టి అరుణ, పాల్గొన్నారు.

డెంకాడ: ఎమ్మెల్యే లోకం మాధవి బుధవారం మండలంలో నాలుగు సబ్‌స్టేషన్ ఫీడర్లను ప్రారంభించారు. మోదవలస గ్రామంతో సహా నాలుగు ప్రాంతాల్లో ఆమె సబ్‌స్టేషన్ ఫీడర్‌ల ప్రారంభించారు.

సెంట్రల్ లైబ్రరీ ప్రారంభం

డెంకాడ గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన సెంట్రల్ లైబ్రరీను ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ యువతకు చదువులో ముందుకు నడిపించే సాధనగా లైబ్రరీలు ఉపయోగపడతాయన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

రాజాం: ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం రూ.50లక్షలతో నాలుగు ఫిడర్ లైన్లు ప్రారంభించారు. అనంతరం కంచరాం, ఒమ్మి సచివాలయాలను, గార్రాజు చీపురుపల్లిలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎడిఇ ఫణేంద్ర కుమార్, ఆర్‌డిఒ బి.ఆశయ్య, ఎఇలు కుమార్, సురేష్, ఎంపిడిఒ వి.శ్రీనివాసరావు, తహశీల్దార్ రాజశేఖర్, ఒమ్మి సర్పంచ్ వంగ వెంకట్రావు, జనసేన నాయకులు యూపి రాజు, గెడ్డపు నీలకంఠం, నాగరాజు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వంగర: సంగాం నుండి మడ్డువలస బ్రిడ్జి వరకు నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు ఎమ్మెల్యే కోండ్రు మురళీ బుధవారం సంగాం వద్ద శంకుస్థాపన చేశారు. వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నూతన భవనాన్ని ప్రారంభించారు. శివ్వాం నుండి ఓని అగ్రహారం వరకు రూ.1.65 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శివ్వాం వద్ద, రుషింగి బీటీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శివ్వాం ఎస్‌సి కాలనీలో సిసి రోడ్డు, కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతినిచ్చారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు యు. మురళి వాసుదేవరావునాయుడు, కృష్ణమూర్తి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నెగ్గిన అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ వైస్ ఛైర్మన్ జి.రమాదేవిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. వైస్ ఛైర్మన్ పదవిపై టిడిపి, వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌డిఒ రామ్మోహనరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా 21మంది టిడిపి, వైసిపి కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు బేబినాయన అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేశారు. సమావేశానికి హాజరైన సభ్యులంతా మద్దతు ఇవ్వడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్‌డిఒ రామ్మోహనరావు ప్రకటించారు. దీంతో టిడిపి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలలో నూతనోత్సాహం నెలకొంది.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని చల్లపేట పిహెచ్‌సిలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ విశాఖపట్నం వారి సహకారంతో జరిగిన ఈ శిబిరంలో ఆప్తమోలాజిస్ట్ డాక్టర్ దుర్గ 71 మంది కంటి రోగులకు పరీక్షలు జరపగా, 41 మందిని కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి, కంటి వైద్య నిపుణులు యల్‌యల్‌యన్ మూర్తి, క్యాంప్ సమన్వయకర్త వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆమె కళ్లు సజీవం

ప్రజాశక్తి-చీపురుపల్లి

నేత్రదానంతో తన భార్య సజీవంగా చూస్తుందని భావించి పట్టణంలోని ఆంజనేయపురంనకు చెందిన అందవరపు నర్సింగరావు మృతి చెందిన తన భార్య కార్నియాలను దానం చేశారు. బుధవారం మృతి చెందిన జగదాంబ కళ్లు దానం చేయాలని స్థానిక మానవీయత స్వచ్ఛంధ సేవా సంస్థ అద్యక్షుడు బివి గోవిందరాజులు ఆ కుటుంభాన్ని కలసి కోరారు. దీంతో ఎటువంటి ఆలోచన చేయకుండా మృతురాలి భర్త నర్సింగరావు, కుమార్తె భవానీలు నేత్రదానానికి అంగీకరించారు. దీంతో విజయనగరం రెడ్‌క్రాస్ సొసైటీ టెక్నిషియన్లు రమణ, సుధాకర్‌లు వచ్చి కార్నియాలను సేకరించారు.

నిర్మాణాలు పూర్తవకుండా ప్రవేశాలా?

శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిర్మాణాలను పూర్తికాకుండా అడ్మిషన్లు చేస్తున్న ప్రదీప్‌నగర్‌లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆ పాఠశాల వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ విద్య బలోపేతం చేయడం మానేసి, కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. విద్యాసంవత్సరం ప్రారంభం అవుతున్నా శ్రీచైతన్య పాఠశాల నిర్మాణ దశలోనే ఉందని, అయినా సరే పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లు నిర్వహిస్తూ, పుస్తకాల వ్యాపారం కూడా చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాలలో లిఫ్ట్ నిర్మాణ దశలో ఉందని, కరెంట్ వైర్లు బయటే వేలాడుతూ ఉన్నాయని, గురువారం విద్యార్థులు వచ్చి వారికి ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యతని అధికారులను ప్రశ్నించారు. దీనిని అడ్డుకోవాల్సిన డిఇఒ మాణిక్యంనాయుడు కనీసం స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికే జిల్లాలో 10 చోట్ల పుస్తకాలు అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టుకుంటే ఒక్క చోట కూడా చర్యలు తీసుకునే పరిస్థితి లేదన్నారు. అంటే కార్పొరేట్ యజమాన్యాలకు కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, అవినీతి చర్యలకు పాల్పడుతున్న డిఇఒ మాణిక్యంనాయుడును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు, జె.రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి పి. రమేష్, ఇ.వంశీ , శిరీష, నాయకులు యర్రమ్మ, గుణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాలువలపై నిర్మాణాలను ఉపేక్షించం: కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాలువలు, ఫుట్‌పాత్‌లపై నిర్మాణాలను ఉపేక్షించబోమని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టంచేశారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పలు ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుధ్య విధానాన్ని పరిశీలించారు. గంజిపేట వద్దనున్న ప్రధాన కాలువ పరిస్థితిని పరిశీలించారు. ఆయన ఆదేశాలతో కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను జెసిబి సహాయంతో ప్రజారోగ్య సిబ్బంది తొలగించారు. కాలువలో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను తప్పించారు. కాలువపై ఉన్న తాత్కాలిక నిర్మాణాలను తొలగించి వేశారు. అనంతరం అన్న క్యాంటీన్ వద్దకు చేరుకుని పేదలకు అందుతున్న ఆహారం పట్ల కమిషనర్ ఆరా తీశారు. ఆహారం ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు.

సబ్‌జైల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

విజయనగరం సబ్‌జైల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పలు చట్టాలపై అవగాహన కల్పించారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. జైల్ క్లినిక్‌లను సందర్శించే న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు. జైలులో అమలవుతున్న సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని, భోజనశాలను పరిశీలించారు. స్టోర్ రూమ్ సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్, సబ్ జైల్ సూపరింటెండెంట్, తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎం. బబిత

స్టార్ బిలీవర్‌గా మధుబాబు

ప్రజాశక్తి-విజయనగరం

సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (సీతం) కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ మొగలి మధుబాబుకు స్టార్ బిలీవర్ ప్రశంసాపత్రం లభించింది. మద్రాస్ ఐఐటి నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్‌పిటిఇఎల్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ పరీక్షల్లో నాలుగు విభిన్నమైన సబ్జెక్టుల్లో మధుబాబు ఉత్తీర్ణత సాధించారు. దాంతోపాటు ఐఒటి సబ్జెక్టులో 88 శాతం మార్కులు సాధించి, సిల్వర్ ప్రశంసా పత్రం పొందారు. దీంతో ఆయనకు ఎన్‌పిటిఇఎల్ స్టార్ బిలీవర్ ప్రశంసా పత్రం లభించింది. జులై ఆరో తేదిన మద్రాస్ ఐఐటిలో జరిగే ఒక్కరోజు ఐఐటి స్టార్ బిలీవర్స్ వర్క్‌షాప్‌కు ఆయనకు ఆహ్వానం లభించింది. మధుబాబును సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపల్ డివి రామమూర్తి అభినందించారు.

ఇంటర్‌లో 'భాస్కర్' హవా

ప్రజాశక్తి- పార్వతీపురం

2021- 2025 విద్యా సంవత్సరాల వరకు సాధారణ విద్యార్థులతో అసాధారణ ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం చూపిన స్థానిక భాస్కర్ జూనియర్ కాలేజ్ దే హవా కొనసాగుతుంది. 'ఎడ్యుకేషన్ ప్రత్యేక సంచిక' సందర్భంగా ఆ కళాశాల చైర్మన్ బొంతు శ్రీనివాస్ రావు 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంబంధించిన సాధారణ విద్యార్థులకు కార్పొరేట్ విద్యా బోధనలను అందించి అసాధారణ ఫలితాలను మాటల్లో కాకుండా ఆచరణలో చూపించడం తమ ప్రత్యేకత అన్నారు. 2025 ఇంటర్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో సీనియర్ ఇంటర్ ఎంపిసిలో మడక అశోక్ 959మార్కులు, ఎం.లక్ష్మి 936 మార్కులు, ప్రథమ ఇంటర్లో ఆర్.వెంకటేష్ ఎంపిసిలో 464మార్కులు, కె.గాయత్రి 464 మార్కులు సాధించారు. 2023లో జె.జగన్మోహన్, సిహెచ్ మీనాక్షి ఎంపిసిలో 980 మార్కులు సాధించగా, వి.రేష్మ 970 మార్కులను సాధించడమే కాకుండా జెఇఇ మెయిన్స్‌లో జె.జగన్మోహన్ 77.55 పర్సంటైల్ సాధించి ఆల్ టైం రికార్డును సృష్టించాడు. 2022లో ఎం.తేజ 988, 2021 బి.కరుణాకర్ 990 మార్కులను సాధించి టౌన్ రికార్డులను సృష్టించారు. ఇంటర్ ఎంపిసి, బైపిసితో పాటు ఐఐటి, జెఇఇ మెయిన్స్, నీట్‌తో ప్రతిభ కనబర్చారు. ప్రతిభా పరీక్షలకు అనుగుణంగా వైజాగ్ ఫ్యాకల్టీతో బోధనలు ప్రారంభిస్తున్నాం.

విద్యార్థులకు మానసిక వికాసం కలిగేలా సువిశాల తరగతి గదులతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధనలు అందిస్తూ శారీరిక, మానసిక వికాసం కోసం క్రీడలను ప్రోత్సహిస్తూ, సైన్స్ డే, ఫేర్వెల్స్ డే, టీచర్స్ డే వంటి కార్యక్రమాలతో ఆట పాటలతో పాటు ప్రముఖ విద్యావేత్తలను, అధికారులను ఆహ్వానించి విద్యార్థులకు అవసరమైన సూచనలు సలహాలు అందిస్తున్నాం. ఈ ఏడాది టెన్త్‌లో 500 మార్కులు పైబడిన వారికి ప్రథమ ఇంటర్లో 400 పైబడిన వారికి ఉచిత బోధనలు అందించే అవకాశాన్ని కల్పిస్తున్నాం.

ఉద్యోగ షూరిటీ భాస్కర్ డిగ్రీదే..

బొంతు శ్రీనివాసరావు డైరెక్టర్

తమ విద్యా సంస్థల్లో డిగ్రీ పూర్తయిన విద్యార్థికి ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత తమదే. 2022-25 బ్యాచ్‌లో డిగ్రీ బికాం విద్యార్థిని గెంబలి శ్రీప్రియ సిజిపిఎ 8.65, బిఎస్‌సిలో కె.లావణ్య 9.42 ర్యాంకులను సాధించి మన్యం జిల్లా ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. డిగ్రీ విద్యతో పాటు పోటీ పరీక్షలు, క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ (సిఆర్‌టి) వైజాగ్ ఫ్యాకల్టీతో భాస్కర్ విద్యార్థులను బంగారు భవిష్యగా తీర్చిదిద్దడం సంతృప్తినిస్తుంది. 2022 -23లో 50 మందికి పైగా సాఫ్ట్వేర్ రంగంలోనూ, 30 మందికి పైబడి బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు సాధించి తమ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతున్నారు. పట్టణంలో ఎన్ఎస్ఎస్ కలిగిన ఏకైక విద్యాసంస్థ భాస్కర్.

కార్పొరేట్ బోధనలతో 'శ్రీజన్'

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక బెలగాంలోని వెంకటేశ్వర నర్సింగ్ హోం వెనుక స్థాపించబడ్డ శ్రీజన్ గ్లోబల్ స్కూల్ పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్య బోధనలు అందిస్తున్నారు. 2021లో స్థాపించబడ్డ శ్రీజన్ గ్లోబల్ స్కూల్ తండ్రి వంటి రక్షణ తల్లి వంటి శిక్షణల విద్యాబుద్ధులు నేర్పి, ఐఐటి విభాగంలో గల టెక్నో, జెనిత్ వంటి అత్యాధునిక బోధనలతో విద్యార్థులు అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడే స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు ప్రత్యేకంగా నిర్వహిస్తూ తమదైన ప్రత్యేకతను కనబరుస్తుంది. శ్రీజన్ గ్లోబల్ స్కూల్. సుమారు పదేళ్ల పైబడి కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేసిన శ్రీజన్ మేనేజింగ్ డైరెక్టర్ యు.శ్రీనివాసరావు జిల్లాలోని పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ విద్య అందించాలనే సంకల్పంతో 2021లో శ్రీజన్ గ్లోబల్ స్కూల్ స్థాపించారు. సాధారణ విద్యార్థులను ప్రతిభావంతులుగా

పర్యావరణపై అవగాహన కల్పిస్తున్న శ్రీజన్ చిన్నారులు

మార్చుతూ చాలామంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారు. పదుల సంఖ్యతో ప్రారంభించిన శ్రీజన్ గ్లోబల్ స్కూలు వందలాది విద్యార్థులు చేరుతున్నారు. శ్రీజన్ ప్రారంభించిన మూడేళ్ల వరుసగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతతో హ్యాట్రిక్ విజయాలను సాధించింది. 2025లో కె.సాధన, కె.గణేష్ 580 మార్కులను సాధించడమే కాకుండా 40 మంది విద్యార్థుల్లో 26 మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులను సాధించారు.

శ్రీజన్ ప్రత్యేకతలు

మార్కులకే ప్రాధాన్యత ఇస్తున్న నేటి కాలంలో మార్కులతో పాటు పోటీ పరీక్షలకు తగిన విషయ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందేలా బోధనలు జరుగుతున్నాయి. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులను నిర్వహిస్తూ ముందుకు నడిపిస్తున్నారు. సైన్స్ డే , మ్యాథ్స్ డే, తెలుగు డే, హిందీ డే వంటి కార్యక్రమాలు, విద్యార్థులకు సామాజిక స్పృహ, మానసిక వికాసం కలిగించే డాన్స్, ఆటలు, పాటలు థైకాండో నేర్పడమే కాకుండా మానసిక ఉల్లాసం కోసం సందర్శనార్థ ప్రదేశాలకు తీసుకువెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ వాటిపై కార్యక్రమాలు చేపట్టి మొక్కలు నాటే కార్యక్రమాలు కూడా చేస్తున్నారు.

ఎపిఇఎపి సెట్ స్టార్.. 'వేదాంత'

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

జశ్వంత్

శ్రీచందన్

భరత్‌చంద్ర

నవ్యశ్రీ

స్థానిక వేదాంత ఐఐటి జెఇఇ అకాడమీ జూనియర్ కాలేజ్ విద్యార్థులు 2025లో ఎపిఇఎపి సెట్ ర్యాంకులను సాధించి అప్సెట్ స్టార్స్‌గా రికార్డ్ సృష్టించారు. ఇంజినీరింగ్ విభాగంలో వేదాంత డైరెక్ట్ క్లాస్ రూమ్ స్టూడెంట్ పి.జశ్వంత్ 2856, అగ్రికల్చర్ విభాగంలో వేదంతులు లాంగ్ టర్మ్ 1222, బక్క వాణి 1739, ఉసిరిపాటి ఆశ్రిత ప్రియా 6421, గంట్రెడ్డి నీలిమ 7581, ద్వారపు రెడ్డి సాహితీ నాయుడు 9951, చింతల సాయి సంజన 12021, దుప్పలపూడి గౌతమి 16454, ఏలూరు సాయి లక్ష్మి 18046, ర్యాంకులు సాధించారు. ఆల్ ఇండియా స్థాయిలో డొంకాడ శ్రీచందన్ 1827వ ర్యాంకు, నగిరెడ్డి భరత్ చంద్ర 4759వ ర్యాంకు సాధించి వేదాంత విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఎపిఇఎపి ర్యాంకులు వచ్చిన సందర్భంగా 'ప్రజాశక్తి'తో వేదాంత జూనియర్ కాలేజ్ చీఫ్ మెంటార్ పెంట అప్పారావు, ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ ఎస్ఎల్ నాయుడు, డీన్ అకాడమిక్స్ రమణబాబు మాట్లాడుతూ మన్యం జిల్లా పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు వేదాంత ఐఐటి జెఇఇ అకాడమీ జూనియర్ కళాశాల ప్రత్యేక శిక్షణ ద్వారా ఎపిఇఎపిలో హెచ్చయు స్టార్స్‌గా గుర్తింపు పొందారని అన్నారు. ఇందుకు సహకరించిన తమ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు తిరిగి స్వాగతం

ప్రజాశక్తి- రాజాం

ప్రియమైన విద్యర్థిని, విద్యార్థుల్లారా మీ అందరకి తిరిగి స్వాగతం .. మీ ప్రతి ఒక్కరిని మళ్ళీ స్కూల్‌కు ఆహ్వానించిడం చాలా ఆనందంగా ఉంది. మీ ఉత్సాహంతో మన ప్రాంగణం మళ్ళీ జీవంతమవ్వబోతుంది. మీ సందేహాలు కోసం తరగతులు ఎదురు చూస్తున్నాయి, మీ నవ్వులతో ఆట మైదానం పరవశించబోతుంది. కొత్త విద్యా సంవత్సరానికి నాంది పలుకుతుంటే, మీ తళతళలాడే ముఖాలతో మా హృదయాలు హర్షించనున్నాయి. కేవలం చదువు నేర్చుకొనే స్థలం మాత్రమే కాదు.. ఇది మీ ఎదుగుదల, అద్భుత, అన్వేశానికి వేదిక- ఒక కుటుంబం అని గుర్తుంచుకోండి. ఈ ఏడాది ఆశ్చర్యకరమైన అధ్యాయానికి సిద్ధం అవ్వండి. అభివృద్ధికి, విజయానికి మధుర జ్ఞాపకాలకు మేము అందరం సిద్ధంగా ఉన్నాం. రండి - కలిసి మెలిసి, ఈ సంవత్సరాన్ని మధురంగా మార్చుకుందాం..

బడుగంటి రాజేష్ (ఎంఎస్‌సి),అబ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్, రాజాం

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ గ్రామంలో సీతారామ ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.









పిఎం జుగా సర్వే వేగవంతం

ప్రజాశక్తి - సీతంపేట

పిఎం జుగా సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం సీతంపేట, భామిని మండలాల సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సీతంపేట, భామిని మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో పిఎం జుగా సర్వేను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. తప్పుల్లేకుండా సర్వే చేయాలన్నారు. లబ్ధిదారుల అన్ని వివరాలను సర్వేలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, ఎంపిడిఒలు మిశ్రో, డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది ఇతర తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న పోలీస్ స్టేషన్ పరిధిలో కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఒడిశా నుంచి వస్తున్న ప్రతి వాహ నాన్ని క్షుణ్ణంగా ఎస్ఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా నుంచి నిషేధిత వస్తువులైన గంజాయి, మద్యం నాటు సారా రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఒడిశా నుంచి ఆంధ్రాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని పరిశీలించిన అనంతరం విడిచిపెడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాయని తెలిపారు. ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు వెల్లడించారు. గంజాయి, మద్యం అక్రమ తరలింపు ప్రజలకు సమాచారం తేలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

అవార్డుల ఎంపికలో గిరిజన విద్యార్థులకు మొండిచేయి

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా అవార్డుల ఎంపికలో గిరిజన సంక్షేమశాఖకు గిరిజన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారులు మొండిచేయి చూపడంలో ఆంతర్యం ఏమిటని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ ప్రశ్నించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సోమవారం రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీద ప్రతిభ అవార్డు పంపిణీలో భాగంగా ప్రతి మండలంలోని వివిధ పాఠశాల నుండి ఒక్కొక్కరిని ఎంపిక చేశామని చెప్పి ఒకే పాఠశాల నుంచి ఇద్దరు, ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థులకు ఎంపిక చేయకపోవడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థులను మరిచారా లేక చిన్న చూపుతో అవార్డులను ఇవ్వకూడదని నిరాకరించారో జిల్లా విద్యాశాఖ అధికారులు తెలపాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

కబడ్డీ శిక్షణను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 16 నుంచి 26 వరకు ఆంధ్రప్రదేశ్ అండర్-18 బాలురు కబడ్డీ టీం కోచింగ్ క్యాంప్ విజయవంతం చేయాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు పల్లా కొండలరావు అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కబడ్డీ టీం జాతీయ స్థాయిలో పాల్గొనడానికి ఈ కోచింగ్ క్యాంపు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ క్యాంపునకు భోజన సదుపాయంతో పాటు వసతి సమకూరుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కోడి సుదర్శన్ రావు, కార్యదర్శి వెన్నపు చంద్రరావు, కోశాధికారి శనగల సీతారాం, కాయల రమేష్ తదితరులు పాల్గొన్నారు

కొసలిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని కోసలిలో బాలేరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరం ద్వారా 53మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గ్రామాల్లో జ్వరాల సర్వే, లార్వే సర్వే నిర్వహించారు. జ్వరాల సర్వే ద్వారా గ్రామంలో గుర్తించిన ఇద్దరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వ్యక్తిగత ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, బాలేరు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

కేంద్రప్రభుత్వం తీసుకొచ్చి నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలు నశించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మధ్యాహ్నం భోజనం కార్మికుల సమావేశం జరిగింది. తొలుత జులై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలంటూ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రమణారావు మాట్లాడుతూ బిజెపి మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొస్తుందని అన్నారు. లేబర్ కోడ్‌లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం చేయాలని, ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఆశా, అంగన్వాడి, మధ్యాహ్నం భోజన పథకం, శానిటేషన్ వర్కర్స్, విఒఎ, విఆర్ఎ, ఆర్‌పిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆప్కోస్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జులై 9న సమ్మె చేపట్టనున్న సమ్మె జయప్రదానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ రోయిభాయి, ఎ.బుజ్జి, డి.సునీత, మధ్యాహ్నం భోజన కార్మికులు పాల్గొన్నారు.

కొమరాడ : జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. స్థాని ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006 నుంచి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజకీయ వేధింపులతో పార్టీలు మారినప్పుడల్లా రాజకీయ ఒత్తిళ్లకు గురవుతూ చాలీ చాలని వేతనంతో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులాపాలని డిమాండ్ చేశారు. జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికులతో మాట్లాడుతున్న రమణారావు

'ప్రజా పంపిణీ'ని మెరుగుపర్చాలి : సిపిఎం

తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రజలకు నిత్యావసరాల పంపిణీలో ఎండియు వ్యవస్థ రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, రేషన్ షాపుల వద్ద కూడా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎండియు నిర్వాహకులు, ఉపాధి వేతనదారులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేణు, సిపిఎం మండల కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడారు. ఎండియు వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్ద బియ్యం అందించడం ఎంతో సౌకర్యంగా ఉందని, ఈ వాహనం వచ్చే సమయానికి కూలి పనులకు వెళ్లిన పేదలకు తర్వాత రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకొనేలా ఏర్పాటు ఉండాలని కోరారు. ఈ వాహనాల ద్వారా అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించకుండా డిపోల వద్దనే తెచ్చుకోమనడం సరైంది కాదన్నారు. నగదు బదిలీ ప్రవేశపెట్టడమంటే ప్రజా పంపిణీ (రేషన్) వ్యవస్థను ప్రజల నుంచి దూరం చేయడమేనని, మార్కెట్లో బియ్యం ధరలు పెరిగినా ప్రభుత్వం ఇచ్చే నగదు మాత్రం పెరగదని,అంతిమంగా పేద ప్రజలు నష్టపోతారని అన్నారు. కావున రేషన్ సరుకులు బదులు నగదు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గేదెల సత్యనారాయణ, బొద్దాన భానుమూర్తి, దన్నాన త్రినాధ, యు.లక్ష్మి, బలరామునాయుడు, నల్ల ఈశ్వరరావు, ఎండియు మండల నాయకులు రవి, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు

భవనాలు ప్రారంభించి ప్రజారోగ్యం కాపాడాలి : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

కొనఊపిరితో కొనసాగుతున్న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదులు కొత్తగా నిర్మిస్తున్న భవనాలను ప్రారంభించి, ప్రజల ఆరోగ్యం కాపాడాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, మండల కార్యదర్శి ఈశ్వరరావు, నాయకులు రాయిపల్లి రాము, గవర వెంకటరమణ, బి అప్పారావు, శిథిలావస్థలోఉన్న పాత భవనం, నిర్మాణం జరిగిన కొత్త హాస్పిటల్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక పిహెచ్‌సిలో నైపుణ్యం గల ఇద్దరు వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటున్నా సరేనా మందులు, వైద్య పరికరాలు లేక వైద్యం కోసం వచ్చే రోగులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేయాల్సి వస్తుందన్నారు. ఈ ఆసుపత్రి 7 ×24 గంటలు వైద్య సర్వీసులో ఉన్నా భవనమంతా శిథిలావస్థలో ఉందని, వర్షాలకు నాని ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందని అన్నారు. అంతేకాక ఆసుపత్రి పరిసరాల్లో విష సర్పాలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో సిబ్బంది భయంతో హడలి పోతున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో రోగులకు వైద్య సేవలందించడం సిబ్బందికి కత్తి మీద సామేనని, ఈ పరిస్థితి ఉండడంతో అత్యవసరంగా వైద్యం చేయలేని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై గత రెండేళ్ల నుంచి రోగులు, ప్రజాసంఘాలు, సిబ్బంది, జిల్లా వైద్యాధికారికి, కలెక్టర్‌కు, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా రూ.కోటీ 60 లక్షలకు పైగా ఖర్చు పెట్టి కొత్త ఆరోగ్య కేంద్రభవనం నిర్మించినా, నేటికీ ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసుపత్రిలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆహార అలవాట్లు మార్చుకోవాలి

'ప్రజాశక్తి' వార్తకు స్పందించిన వైద్యాధికారులు

ప్రజాశక్తి - కొమరాడ

ప్రస్తుతం వస్తున్న వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉంటూ ఆహార అలవాట్లు మార్చుకొని అవసరమైన వారు వచ్చి వైద్య తనిఖీలు చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహన్ రావు అన్నారు. 'ప్రజాశక్తి'లో బుధవారం ప్రచురితమైన 'గంగరేగువలసకు కేన్సర్' అన్న వార్తకు అధికారులు స్పందించారు. బుధవారం ఆయన గంగరేగువలసలో పర్యటించారు. ఈ సందర్భంగా కేన్సర్, ఇతర వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇంటికి వెళ్లి వివరాలు ఆరా తీసి రోగుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు ఏమి చికిత్స తీసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిడిసిడి సర్వే సిబ్బంది పక్కగా పట్టాలని ఆదేశించారు. ప్రతి ఇంటికెళ్లి ప్రజల ఆరోగ్యస్థితిగతులను అడిగి తెలుసుకుని వారికి ఏమైనా అనారోగ్యం ఉంటే తక్షణమే ఉన్నతాధికారులకు నివేదికలు అందించాలని అన్నారు. కేన్సర్‌తో బాధపడుతున్న వారు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నప్పటికీ ఆ బిల్లులన్నీ ఒకేసారి ప్రభుత్వానికి అందజేస్తే బాధిత కుటుంబాలకు అందించేందుకు అవకాశం ఉందన్నారు. కేన్సర్ అనుమానిత లక్షణాలున్నవారు ముందుగానే తనిఖీలు చేసుకోవాలన్నారు. కేన్సర్ లక్షణాలను ముందుగా గుర్తిస్తే కొంతమేరకు చికిత్స అందించి ప్రాణాలను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనారోగ్యాన బారిన పడకముందే జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది ఎఎన్ఎం స్వాతి వైద్య సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్‌చైర్‌పర్సన్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

అందరికీ సమాన వేతనాలివ్వాలి

మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలు విధంగా చెల్లించాలని, అలా కాకుండా ప్రభుత్వం ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఇటువంటి విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మకు మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతిని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో కార్మికులందరికీ ఒకేలా వేతనం చెల్లించకుండా పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు చెల్లిస్తుంటే ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు రూ.15వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. దీనివల్ల కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాయని, చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి విధానం ప్రభుత్వాలకు మంచిది కాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి 12వ పిఆర్‌సిని అమలు చేసి పారిశుధ్య కార్మికులకు ఇచ్చినట్లే మున్సిపల్ కార్మికులకు కూడా జీతాలు పెంచి అందజేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే జూన్ 15 తర్వాత జరగబోయే సమ్మెకు వెళ్లడానికి కూడా వెనుకడుగు వేయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు, డి.సంతోష్, అమర్, పంచముఖి, శ్రీను, ఉమా, అప్పన్న, భవాని పాల్గొన్నారు.

ఎఎన్ఎం పోస్టులను నియమించాలి

ప్రతి నెలా మెడికల్ క్యాంపులు నిర్వహించాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని గిరిజన ఆశ్రమం పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని, ప్రతినెలా మెడికల్ క్యాంపులు నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేపట్టాలని, గిరిజన ఆశ్రమపాఠశాలలకు అదనపుభవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.అఖిల్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు, గత విద్యా సంవత్సరంలోనే సుమారుగా ఏడుగురు విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. వీటిపై సంబంధిత మంత్రి ఎటువంటి నివారణ చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వం వైఫల్యమైమని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమవుతున్నా ఇప్పటికీ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అదనపు భవనాలు నిర్మాణం పూర్తి కాలేదన్నారు. అందువల్ల విద్యార్థులు ఇబ్బందులు పాలవుతారన్నారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అభి, పట్టణ కమిటీ సభ్యులు రాజేష్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గురువారం 12 జూన్ 2025

డిఎంహెచ్ఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, నాయకులు

ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా ఆసుపత్రి, జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో మెరుగైన వసతి, వైద్య సౌకర్యాలు కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావును సిపిఎం నాయకులు కోరారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ఆధ్వర్యాన సిపిఎం నాయకులు డిఎంఅండ్‌హెచ్ఒను కలిశారు. వైద్య, ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు, మౌలిక వసతుల కల్పన, పెరుగుతున్న రోగులకు అనుగుణంగా ప్రభుత్వాసుపత్రుల్లో వసతి ఏర్పాటు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గంగునాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు ఉధృతమయ్యాయని, పిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగిందని చెప్పారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాసుపత్రుల్లో వసతుల్లేవని తమ పరిశీలనలో తేలిందని తెలిపారు. జిల్లాలో ప్రజలు ప్రభుత్వ వైద్యం పైనే ఆధార పడుతున్నారని, నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, పిహెచ్‌సిలను తక్షణమే పూర్తి చేయాలని, తాత్కాలిక ప్రాతిపదికన తక్షణమే బెడ్‌లు ఏర్పాటు చేయాలని, సరిపడా మందుల నిల్వ ఉంచాలని డిమాండ్ చేశారు. కొమరాడ మండలం గంగురేగవలసలో కేన్సర్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. గరుగుబిల్లి మండలం పెద్దూరు, జియ్యమ్మ వలస మండలం గడసింగపురంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై వైద్య, ఆరోగ్యశాఖ తక్షణమే ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలన చేసి నివారణా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి డిఎంహెచ్ఒ స్పందిస్తూ ఈ సమస్యల న్నింటిపై సమగ్రమైన పరిశీలన చేయిస్తానని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ, గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

సంచార పశు వైద్య ఉద్యోగులకు భద్రత కల్పించాలి

అక్రమ తొలగింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలోని సంచార పశు వైద్య సేవా పథకం ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన సంచార పశు వైద్య సేవా ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సంచార పశు వైద్య సేవా పథకాన్ని 2022 మే 1న ప్రారంభించిందని, అందులో భాగంగా జిల్లాలో ఎనిమిది అంబులెన్స్‌లో 24 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, వారిలో కొంత మందిని తొలగించి వారి స్థానంలో వేరే వారిని నియమించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా ఉద్యోగులను తొలగించడం దుర్మార్గమని అన్నారు. కావున ప్రభుత్వ వ్యవస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు ఈ పథకాన్ని నిర్వహించిన జివికెఎంఆర్ఐ సంస్థ నుంచి కాంట్రాక్ట్, భవ్య హెల్త్ సర్వీసెస్‌కు మారిందని, ఈ క్రమంలోనే రాజకీయ నాయకుల ఒత్తిడితో ఉద్యోగుల తొలగింపులకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని ఈ సంచార పశు వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులను యధావిధిగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో వీరితో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఒ కె.హేమలతకు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, యూనియన్ నాయకులు ఎం.తిరుపతి, ఇ.గణేష్, సాయి చక్రవర్తి, వెంకటేష్, జి మురళి, పి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలోని మూడు మండలాలు, మున్సిపాల్టీకి యువజన విభాగం అధ్యక్షులుగా పలువురు యువ నాయకులను నియామకం చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నియామకమైన వారిలో పార్వతీపురం పట్టణ యువజన విభాగం అధ్యక్షులుగా బిఎస్ సంతోష్‌కుమార్, యువజన విభాగం మండల అధ్యక్షులుగా ఉరిటి అప్పలనాయుడు, సీతానగరం, బలిజిపేట మండలాల యువజన విభాగం అధ్యక్షులుగా దాసరి కిషోర్, రణధీర్ లక్ష్మణరావు ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు వారికి శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వచ్చే సాధారణ ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకునేందుకు అందరితో కలిసికట్టుగా పనిచేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

11 రహదారులకు అటవీ అనుమతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 11 రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు మంజూరు చేశారు. బుధవారం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన వర్చువల్ విధానంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ కమిటీ సమావేశంలో కురుపాం మండలంలో సందిగూడ నుంచి కాగుమానుగూడ వరకు 820 మీటర్ల రహదారి నిర్మాణానికి, కాగుమాను గూడ నుంచి సాలిదంగు వరకు 820 మీటర్లు, పొద్దిస నుంచి సాలమానుగూడ వరకు 1320 మీటర్లు, సాలమానుగూడ నుంచి చాపరాయిగూడ వరకు 1300 మీటర్లు, దాముగూడ నుండి చినంటుజోల వరకు 815 మీటర్లు, మంటికొండ నుండి దాముగూడ వరకు 733 మీటర్లు, జె పులుపుట్టి నుండి వైపులిపుట్టి వరకు 1140 మీటర్లు, జాజరుగూడ నుండి జె పులుపుట్టి వరకు 1120 మీటర్లు, తిత్తిరి నుంచి దొమ్మిడి వరకు 1208 మీటర్లు, దొమ్మిడి నుండి గాలిమానుగూడ వరకు 1034 మీటర్లు, తిత్తిరి నుంచి గునుగూడ వరకు 1197 మీటర్లు రహదారి నిర్మాణానికి అనుమతులు జారీ అయ్యాయి. ఈ రహదారులు గిరిజన ఆవాసాలకు బయటి ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు అత్యావశ్యమని కమిటీ భావించింది. త్వరగా రహదారులు నిర్మాణం చేసి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఎఫ్ఒ జిపిపి ప్రసూన పాల్గొన్నారు.

ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కర్షకుల పండగ ఏరువాక పౌర్ణమి: కలెక్టర్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతుల పండగ ఏరువాక పౌర్ణమి అని, ప్రకృతిని, భూమిని గౌరవించడం దీని ముఖ్యఉద్దేశ్యమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని ఏరువాక పౌర్ణమిగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుందని గుర్తుచేశారు. మండలం లోని దత్తివలసలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ నేపథ్యంలో పొలంలో దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ష రుతువు ఆరంభంలో తొలకరి చినుకు కోసం రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందు భూమి పూజ చేస్తారని, నాగలి, ఎద్దులు, ఇతర సేద్యానికి సంబంధించిన పనిముట్లను పూజిస్తారని కలెక్టర్ తెలిపారు. ఇది వ్యవసాయం, ప్రకృతి మధ్య సంబంధాన్ని గుర్తుచేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా లాభాదాయకమైన, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే పంటల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది అధిక దిగుబడితో రైతులు, వారి కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, ఎడిలు,ఇతర వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరచడం తప్పే : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

మహిళలను ఎవరు కించపర్చినా తప్పేనని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. బుధవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అమరావతి మహిళలనుద్దేశించి ఒక టీవీ ఛానల్ డిబేట్‌లో రాజకీయ విశ్లేషకులు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమేనన్నారు. దీనికి ఆయన క్షమాపణ చెప్పి వివరణ ఇచ్చుకున్నారని చెప్పారు. ఆ వ్యాఖ్యలను వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి, ఆయన సతీమణి భారతీరెడ్డికి ఆపాదించడం తగదన్నారు. పార్టీ కూడా ఆ వ్యాఖ్యలను ఖండించిందని చెప్పారు. ఈ వ్యవహారంలో డిబేట్ నిర్వహించిన సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం సరికాదన్నారు. గతంలో ఎల్లో మీడియాకు చెందిన టీవీ ఛానళ్లలో మహిళలను కించపర్చిలా జర్నలిస్టులు, విశ్లేషకులు వ్యాఖ్యలు చేశారని చెప్పారు. గతంలో మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి కుటుంబం సభ్యులను కించపరుస్తూ అనేకమంది వ్యాఖ్యలు చేశారని, అప్పుడు లేని కేసులు, అరెస్టులు ఇప్పుడెలా చేస్తారని ప్రశ్నించారు.

వెంకంపేట పాఠశాల స్థాయి పెంపు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని వెంకంపేట ఎంపి యుపి పాఠశాల జిల్లా పరిషత్తు పాఠశాలగా స్థాయి పెరిగింది. దీంతో ఇక్కడ 1 నుంచి ఐదో తరగతి వరకు మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మంజూరు చేసింది. ఇద్దరు హెచ్‌ఎంలు కూడా నియమించింది.

సమస్యల సుడిగుండంలో సర్కారు బడులు

అసంపూర్తి భవనాలు, అరకొర వసతులు

నేడు ప్రారంభం కానున్న పాఠశాలలు

ప్రజాశక్తి - పార్వతీపురం

సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న సర్కారు బడులు వేసవి సెలవుల అనంతరం గురువారం ప్రారంభం కానున్నాయి. 50 రోజుల తర్వాత మళ్లీ బడిగంటలు మోగుతున్నాయి. ఆటపాటలతో, విహార యాత్రలతో గడిపిన విద్యార్థులు స్కూల్ బ్యాగులను, పుస్తకాలు, క్యారేజ్‌ల బరువెక్కిన గుండెలతో తిరిగి బడులకు బయలుదేరనున్నారు. జిల్లాలో 1701 పాఠశాల లున్నాయి. 1,18,574మంది విద్యార్థులు చదువుతున్నారు. 1,322 ప్రాథమిక పాఠశాలలు, 153 యుపి పాఠశాలలు, 226 హైస్కూళ్లు ఉన్నాయి. ఇవేకాక 14 కస్తూరాబాయి బాలికల పాఠశాలలు, నాలుగు మోడల్ స్కూళ్లు, 415 గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు, 14 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. 65 గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మున్సిపల్ స్కూళ్లు 44, ప్రయివేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు 112 ఉన్నాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది.

అసంపూర్తి పనులు -అరకొర వసతులు

జిల్లాలో మొదటి దశలో గత ప్రభుత్వం హయాంలో నాడు-నేడు కింద మంజూరైన నిధులతో చేపట్టిన పనులు కారణంగా కొన్ని పాఠశాలల్లో మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించారు. తొలివిడతలో జిల్లాలో 486 ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.130.14 కోట్లు అంచనా వేశారు. రూ.118.09 కోట్లు ఖర్చు చేసి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు. అయితే రెండో విడత నాడు -నేడు కింద మంజూరైన నిధులతో పనులు చేపట్టాల్సిన దశలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. రెండో విడతలో 535 పాఠశాలల్లో రూ.144.51 కోట్లు ఖర్చు చేయడానికి నిధులు మంజూరయ్యాయి. రూ.55.45 కోట్లు ఖర్చు కాగా మిగిలిన పనులను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆ పాఠశాలలో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లోనూ సమస్యలు

జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రెండోవిడత నాడు- నేడు కింద మంజూరైన పనులు నిలిపివేయడంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. ఈ పాఠశాలల్లో వంటమనుషులు, కమాటీల నియామకం చాలా కాలంగా జరగలేదు. రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో సకాలంలో విద్యార్థులకు భోజనం పంపిణీ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకం చేపట్టక పోవడంతో విద్యార్థుల ఆరోగ్యం గాలిలో దీపంలా మారింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎఎన్‌ఎంల నియామకం ఫైలుపై తొలి సంతకం చేసినా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు. ఫలితంగా వర్షాకాలంలో గిరిజన విద్యార్థులు మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు మృత్యువాత పడుతున్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ ఇఇగా కుమార్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేటివ్ ఇంజనీర్ కెవిఎస్ఎన్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ నుంచి ఇఎన్‌సి కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఇఇ రమాదేవికి నెల్లూరు బదిలీ అయింది. ఈ సందర్భంగా ఇఇ కూమార్ మాట్లాడితూ ఇంజినీరింగ్ పనులను సకాలంలో నాణ్యతగా చేస్తామన్నారు. సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఇగా జి.రామ్మోహనరావు బాధ్యతలు స్వీకరించారు. కెఆర్ పురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన రవి ప్రసన్నకుమార్ కెఆర్ పురం ఐటిడిఎకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

జాబ్‌మేళాలో 54మంది ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో బుధవారం ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళ నిర్వహించారు. ఈ మేళాకు 12 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ డ్రైవ్‌కు 168 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 54 మంది ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఇటిఐ కళాశాల ప్రిన్సిపల్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాను గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వెంకటరమణ, నైపుణ్యాభివృద్ధి సీడప్ సిబ్బంది హాజరయ్యారు.

19న జిల్లాలో షర్మిల పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 19న జిల్లాలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటించనున్నట్లు డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

నేడు రామతీర్థంలో యోగాంధ్ర

ఏర్పాట్లు పరిశీలించిన జెసి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థం ఆలయ సమీపంలో యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం ఆరు గంటలకు ఇక్కడ యోగా ప్రదర్శన ప్రారంభమవుతుంది. యోగాకు విస్తృత ప్రాచుర్యం కల్పించేందుకు యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పర్యాటక ప్రదేశాలు, పుణ్య క్షేత్రాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిలో భాగంగా రామతీర్థంలోని సీతారామస్వామి ఆలయ సమీపంలో ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇక్కడి ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.సేతు మాధవన్ బుధవారం పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందీ రాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పలు సూచనలు చేశారు. జెసి వెంట స్థానిక అధికారులు పాల్గొన్నారు.

పల్లాకు అశోక్ పరామర్శ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా బుధవారం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి ఆశోక్ గజపతిరాజు విశాఖపట్నంలో పల్లా శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి పల్లా సింహాచలం చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి.రాజు, విజ్జపు ప్రసాద్, విశాఖపట్నం నాయకులు నమ్మి సన్యాసిరావు, పల్లా రమణ, తదితరులు పాల్గొన్నారు.

సిపిసిబి ఆర్‌డి పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద మంజూరైన నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ డైరెక్టర్ డి.సౌమ్య బుధవారం పరిశీలించారు. నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి, ఎన్ కేప్ ద్వారా విడుదలైన నిధులతో చేపడుతున్న ప్రతిపాదిత అభివృద్ధి పనులు, ప్రస్తుత పనులను ఆమె పరిశీలించారు. అభివృద్ధి పనుల పట్ల ఆర్‌డి సంతృప్తి వ్యక్తం చేసినట్లు డిఇ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా ఆదినారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌గా కె.ఆదినారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో విశాఖపట్నంలోని జివిఎంసిలో అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌గా సేవలందించి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్యను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందించారు.

శభాష్ సీతారాం

ఇరువురి ప్రాణాలు కాపాడిన ఆండ్ర ఎస్ఐ

క్షతగాత్రులను తరలిస్తున్న ఎస్ఐ సీతారాం

ప్రజాశక్తి- మెంటాడ, కంటోన్మెంట్

ఆపత్కాలంలో సమర్థవంతంగా విధులు నిర్వహించి, సమయస్ఫూర్తితో వ్యవహరించి ఇద్దరి ప్రాణాలను కాపాడారు.. ఆండ్ర ఎస్ఐ కె.సీతారాం. ఉద్యోగ బాధ్యతలను అంకితభావంతో నిర్వహించిన ఎస్ఐని ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

మంగళవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఆండ్ర పోలీసుస్టేషన్‌కు డయల్ 100/112కు బిరసాడవలస గ్రామ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిపై ప్రమాదం సంభవించినట్లు సమాచారం అందింది. వెంటనే ఆండ్ర ఎస్ఐ కె.సీతారాం హుటాహుటీన స్టేషన్‌కు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న బిరసాడవలస సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వద్దకు చేరుకొన్నారు. రహదారి ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఇద్దరు వ్యక్తులు అపస్మారక స్థితిలో జాతీయ రహదారిపై పడి, రక్తస్రావం అవుతున్నట్లుగా గుర్తించారు. వెంటనే సమాచారాన్ని 108కు అందించారు. రాత్రి కావడం, జాతీయ రహదారిపై ఎవరూ కనబడక పోవడంతో సమీప గ్రామానికి వెళ్లి, గాయపడిన ఇరువురిని ఆస్పత్రికి తరలించేందుకు సాయం అందించాలని కోరారు. అనంతరం గ్రామస్తులు, 108 సిబ్బంది సహకారంతో సహకారంతో గాయపడిన ఇద్దరిని అంబులెన్సులో ముందుగా గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ గూడెం గ్రామానికి చెందిన గెమ్మెల రాంబాబు, గెమ్మెల అప్పలస్వామి ప్రాణాలు నిలిచాయి. ప్రస్తుతం గాయపడిన ఇద్దరూ విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

డయల్ 112/100కు సకాలంలో స్పందించి, గాయపడిన వ్యక్తులను త్వరితగతిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా, సమయ స్ఫూర్తితో వ్యవహరించిన ఎస్ఐ సీతారాంను ఎస్‌పి వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు. తమ వారి ప్రాణాలు నిలిపిన ఎస్ఐకు క్షతగాత్రుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.